సాక్షి
పల్నాడు
VII
శనివారం, 11, మే, 2024


కారులో సభా ప్రాంగణానికి వస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న ప్రజలు


సీఎం వైఎస్ జగన్ చిత్రపటంతో ఓ చిన్నారి ఆనందం


ఉదయం 10 గంటలకు గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార సభకు తరలివచ్చిన అశేష జనసందోహంలో ఓ భాగం

మంగళగిరి జనఝురి

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు పోటెత్తిన జనం
- కిక్కిరిసిన మంగళాద్రి రహదారులు

మంగళగిరి జనసంద్రంగా మారింది. నియోజకవర్గం నలుమూలల నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు తరలివచ్చారు. జై జగన్ నినాదాలతో మంగళగిరి కొండ దద్దరిల్లింది. గౌతమబుద్ధారోడ్డుతోపాటు పట్టణంలోని రోడ్లన్నీ కార్యకర్తలతో కిక్కిరిసిపోయాయి. వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. లక్ష్మీ నారసింహుని కటాక్షం కూడా లభించింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. పెత్తందారులపై పోరుకు మేమంతా సిద్ధం అంటూ మంగళగిరి ప్రజలు మద్దతు పలికారు.


మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య




వైఎస్సార్ సీపీ ప్రచార గొడుగులతో యువకులు

- మీ అమ్మాయి లావణ్యకు సీటిచ్చా గెలిపించండి
- మంగళగిరి ప్రజలను కోరిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- జై జగన్ నినాదాల హోరు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మంగళగిరి సిద్ధమేనా అని ప్రశ్నించినప్పుడు సభికుల నుంచి సిద్ధమే అంటూ అనూహ్య స్పందన వచ్చింది. అప్పటి వరకూ ఎండగా ఉన్నా ముఖ్యమంత్రి వచ్చేసరికి మబ్బులు పట్టి వాతావరణం చల్లబడింది. దీనిపై ముఖ్యమంత్రి కూడా స్పందిస్తూ దేవుడి దయతో ఈ రోజు వాతావరణం కూడా చల్లగా ఉందన్నారు. పేదల భవిష్యత్ మారాలి, పేదల తలరాతలు మారాలి. అలా మారాలంటే మీ బిడ్డ వేస్తున్న అడుగులు ఎంత ముఖ్యమో.. ఈ అడుగులు వేయడం ఎంత అవసరమో ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి కోరారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా, గతంలో చూడని విధంగా నా అక్కచెల్లెమ్మలు వాళ్ల కాళ్ల మీద వాళ్లే నిలబడాలని, నా అక్కచెల్లెమ్మలకు ఏదో ఒక ఆదాయం వాళ్లకు రావాలి...అక్కచెల్లెమ్మల కోసం ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, అక్కచెల్లెమ్మల పేరిటే ఏకంగా 31 లక్షల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ అందులో కడుతున్నవి 22 లక్షల ఇళ్లు.. అక్కచెల్లెమ్మల బాగు కోసం ఇంతగా తపించిన ప్రభుత్వం, ఇన్ని పథకాలు పెట్టిన ప్రభుత్వం గతంలో ఎప్పుడైనా ఉందా? అక్కా జరిగిందా? చెల్లెమ్మా ఎప్పుడైనా జరిగిందా? పెద్దమ్మా జరిగిందా? అని ప్రశ్నించినప్పుడు మహిళల నుంచి మంచి స్పందన వచ్చింది.


సీఎం జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన మహిళలు

2014లో చంద్రబాబునాయుడు మేనిఫెస్టో పేరుతో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని, ఒక్కో హామీని ప్రస్తావిస్తూ ఇలాంటి వాళ్లను నమ్మొచ్చా? అన్నా నమ్మొచ్చా? చెల్లి నమ్మొచ్చా? అని అడిగినప్పుడు నమ్మం అంటూ సమాధానమిచ్చారు. జగన్‌కు ఎక్కడ ప్రజల్లో మంచి పేరు వస్తుందోనని, ఈర్ష్య పడి అవ్వాతాతలకు మొన్నటి వరకు ఇంటికే వచ్చే పెన్షన్ కూడా రాకుండా చేసిన దౌర్భాగ్యులు వీరు. ఎన్నికల కోడ్ వంకతో పాత పథకాలకు కూడా డబ్బులు వేయనీయకుండా తెలుగుదేశం, కూటమి నేతలు అడ్డు పడుతున్నారని ముఖ్యమంత్రి ప్రజలకు వివరించారు.

లావణ్యమ్మ మీలో ఒకరు

- నా చెల్లి లావణ్యమ్మను పరిచయం చేస్తున్నాను. లావణ్యమ్మ మీలో ఒకరు. మంగళగిరి సీటు బీసీలది. వెనుకబడిన వర్గాలది. అలాంటి సీటు గతంలో నేను ఆర్కేకు ఇచ్చాను. ఆర్కేతో నేను ఈ సారి మనం సీటు త్యాగం చేయాలి, ఇక్కడ నుంచి మనం బీసీలను తీసుకుని రావాలని.. ఆర్కేకు ఉన్న సీటు బీసీలకు ఇస్తే.. అక్కడ వాళ్లేం చేస్తున్నారు. బీసీల సీటు కదా.. గెలవడం సులభం అని.. ఏకంగా పెద్దపెద్దవాళ్లు అంతా వచ్చి డబ్బులు మూటలు తీసి ఎన్నికల్లో గెలవడానికి ప్రయత్నిస్తున్నారు అని ముఖ్యమంత్రి అన్నారు.
- ఎంపీ అభ్యర్థి రోశయ్యపైన కూడా మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు ఉంచాలని సవినయంగా మీ బిడ్డ రెండు చేతులు జోడించి పేరు, పేరునా ప్రార్థిస్తున్నాడు అంటూ ప్రసంగం ముగించారు. సభ ముగిసే వరకూ ప్రజలు ఆసక్తిగా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని విన్నారు.

పథకాలన్నీ కొనసాగాలంటే... ఫ్యాన్‌కే ఓటు వేయాలి

వలంటీర్లు మరలా ఇంటికే రావాలన్నా, అవ్వాతాతల పెన్షన్ మళ్లీ ఇంటికే రావాలన్నా... బటన్లు నొక్కిన పథకాల సొమ్ము మళ్లీ నా అక్కచెల్లెమ్మల ఖాతాలకి రావాలన్నా.. పథకాలన్నీ కొనసాగాలన్నా.. లంచాలు, వివక్ష లేని పాలన కొనసాగాలన్నా.. పేదల భవిష్యత్, పేదల తలరాతలు మారాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా, మన వ్యవసాయం, మన వైద్యం మెరుగుపడాలన్నా... ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కాలి. ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కి 175కి 175 ఎమ్మెల్యే స్థానాలు, 25కి 25 ఎంపీ స్థానాలు ఒక్కటి కూడా తగ్గేందుకే వీలు లేదు. సిద్ధమా? అని ప్రశ్నించారు.


కేరింతలు కొడుతున్న యువతులు

చంద్రబాబు, లోకేష్‌లకు ఓటు అడిగే హక్కు లేదు

- రెండోసారి లోకేష్‌కు పరాభవం తప్పదు
- డబ్బు సంచులతో గెలవలేరు.. లావణ్యను గెలిపించాలి
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: చంద్రబాబు, లోకేష్‌లకు ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. పట్టణంలోని గౌతమబుద్ధా రోడ్డులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ డబ్బు సంచులతో గెలవాలని చూసినా సాధ్యం కాదని గుర్తించుకోవాలని హితవు పలికారు. మంగళగిరి బీసీ సీటు అని అందుకే అన్ని వర్గాలకు చట్టసభలలో ప్రాధాన్యం కల్పించాలని సీఎం జగనన్న బీసీ మహిళకు సీటు కేటాయిస్తే పేదలపై డబ్బు సంచులతో గెలవచ్చనే ఉద్దేశంతో లోకేష్ పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఇది పెత్తందార్లుకు పేదలకు జరిగే యుద్ధంలో పేదలదే విజయమని స్పష్టం చేశారు. పెత్తందారులు ఇచ్చే డబ్బులు తీసుకోవాలని అది మన పేదల డబ్బేనన్నారు. బీసీ మహిళ లావణ్యకు నియోజకవర్గ ప్రజలంతా అండగా నిలవాలని ఆకాంక్షించారు. సభకు భారీగా తరలివచ్చిన జనంతోనే లావణ్య విజయం తథ్యమని చెప్పారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారు రోశయ్య మాట్లాడుతూ లోకేష్, పెమ్మసానిలు గెలిస్తే ఒకరు హైదరాబాద్‌కు, ఒకరు అమెరికాకు వెళ్తారని, వారిని కలవాలంటే ప్రజలు వీసాలు పాస్‌పోర్టులు తీసుకోవాలా అని నిలదీశారు. పెమ్మసాని అమెరికా నుంచి వందల కోట్లు తీసుకువచ్చి అహంకారంతో మాట్లాడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య మాట్లాడుతూ సమ సమాజ సంస్కర్త సీఎం జగనన్న అని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, మహిళా నాయకురాలు సంకె సునీత, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పారేపల్లి విజయలక్ష్మి, మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పట్టణ, రూరల్ కన్వీనర్లు ఆకురాతి రాజేష్, మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బుర్రముక్కు వేణుగోపాల్‌రెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, దుర్గగుడి సలహాదారు జెక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఈదులమూడి డేవిడ్ రాజు, దాసరి వీరయ్య, ఈపూరి ఆదామ్, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, రాష్ట్ర మహిళా కార్యదర్శి పాలేటి కృష్ణవేణి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మల్లవరపు సుధారాణి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు చిలకలూరిపేటకు సీఎం వైఎస్ జగన్

- ఉదయం 10 గంటలకు బహిరంగసభ
- జననేత రానుండడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్
- భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేసిన పోలీసు ఉన్నతాధికారులు

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట రానున్నారు. పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే బహిరంగసభలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలనుద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. జిల్లాలో క్రోసూరు, మాచర్ల సభలు విజయవంతమైన రీతిలోనే చిలకలూరిపేట సభను సక్సెస్ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు ముఖ్యమంత్రి జిల్లాకు రానుండటంతో వైఎస్సార్ సీపీ అభిమానుల్లో జోష్ రెట్టింపు అయ్యింది.


బహిరంగసభ జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ బింధుమాదవ్

ఏర్పాట్లను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నేతలు

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగసభ ఏర్పాట్లను ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడులు శుక్రవారం పరిశీలించారు. చీరాల రోడ్డులో కక్కెర దాసయ్య గోడౌన్స్ వద్ద ఏర్పాటు చేసిన సీఎం హెలిప్యాడ్‌ను పరిశీలించారు. తరువాత కళామందిర్ సెంటర్ వద్ద బహిరంగసభ జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు.

భద్రత కట్టుదిట్టం

సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ బింధుమాదవ్ సీఎం హెలిప్యాడ్ ఏర్పాటు చేసిన గ్రౌండ్, బహిరంగ సభ జరిగే ప్రాంతాలను పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాటు తదితర విషయాలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. హెలిప్యాడ్ నుంచి సభ వరకు సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గంలో పటిష్ట బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేయనున్నారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా భారీ భవంతులను ఇప్పటికే పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎస్పీ పోలీసు సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ రామచంద్రరాజు, డీఎస్పీలు జీఎం గాంధీ, వీఎస్ఎన్ వర్మ, సీఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటర్ల కోసం 1026 వీల్ చైర్లు సిద్ధం



నరసరావుపేట: సాధారణ ఎన్నికల్లో భాగంగా పీడబ్ల్యూడీ (పర్సన్ విత్ డిజయబులిటీ) ఓటర్ల సౌకర్యార్థం జిల్లాలో 1026 వీల్ చైర్స్‌ను అందుబాటులో ఉంచినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో నియోజకవర్గానికి సంబంధించి వీల్‌చైర్ల పంపిణీ ప్రారంభించారు. ఏ పోలింగ్ స్టేషన్లో అవసరం ఉంటుందో ఆ పోలింగ్ స్టేషన్లో అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, పీడబ్ల్యూడీ ఓటర్ల నోడల్ అధికారి సునీత, స్వీప్ నోడల్ అధికారి నాగిని, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వీ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు తగవు

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి



వెల్దుర్తి: ప్రశాంతంగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కక్ష్య కట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి అన్నారు. గత ఐదేళ్ళుగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని, ఆయనకు మద్దతుగా ప్రజలందరూ ఉన్నారని చెప్పారు. శుక్రవారం కొత్తపుల్లారెడ్డిగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. చంద్రబాబు వాలంటీరీ వ్యవస్థ పై తన శిష్యుడు నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఈసీకి లేఖ రాయించి ఇంటికొచ్చి ఫించన్లు ఇచ్చే వలంటీరీ సేవలను అడ్డుకున్నారన్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాలకు అందాల్సిన డబ్బులు అందకుండా చేశారన్నారు. చంద్రబాబు వ్యవసాయం దండగని హేళన చేస్తే, అదే వ్యవసాయాన్ని సీఎం జగన్ లాభసాటిగా చేయడంతో పాటు రైతన్నను ఆర్థికంగా పరిపుష్టి చేశారన్నారు. సీఎం జగన్ పంట నష్టం జరిగితే అదే సీజన్‌లోనే రైతన్నకు ఎక్కువ నష్టపరిహారం సకాలంలో అందించారన్నారు. చంద్రబాబు చేసిన పనికి రైతన్నకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించలేని పరిస్థితి దాపురించిందన్నారు. విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన అందిస్తుండగా ఈ పథకాన్ని సైతం ఆపిన దుర్మార్గుడు చంద్రబాబేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎం అంజనీకుమార్ నాయక్, ఎం బాలునాయక్, సర్పంచ్ బూడిద వెంకటేశ్వర్లు, ఎం స్వతంత్ర నాయక్, బి రాము నాయక్ తదితరులున్నారు.

గెలిచేది..నిలిచేది జగనన్నే

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లి మండలంలోని ఐదు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ప్రచార రథం పై నుంచి అభివాదం చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని, ధర్మయుద్ధంలో గెలిచేది, నిలిచేది జగనన్నేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం, పాకాలపాడు, గోరంట్ల, కట్టమూరు, బట్లూరు,గుజ్జర్లపూడి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రచారాలకు మండలపార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అంటే భరోసా, నమ్మకం అనే భావన ప్రజల్లో వ్యక్తమవు తుందన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీకి పొరపాటున ఓటు వేస్తే వందేళ్లు వెనక్కి వెళ్ళినట్లేనని, పేదల జీవితాలకు చంద్రబాబు పాలనలో భరోసా ఉండదన్నారు. విశ్వసనీయతకు అద్దం పట్టేలా ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోతో మరోసారి ప్రజల నమ్మకాన్ని జగన్ చూరగొన్నారన్నారు. నవరత్నాలకు కొనసాగింపుగా నవరత్నాల ప్లస్‌ను ప్రకటించారన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం జరిగిందన్నారు. టీడీపీ బూటకపు హామీల మేనిఫెస్టోను ప్రజలు నమ్మటం లేదన్నారు.

మీరే మా బలం...మరో మారు ఆశీర్వదించండి : సంక్షేమ లబ్దిదారులే వైఎస్సార్ సీపీకి బలమని, మేలు జరిగిందని నమ్మితే మరో మారు ఆశీర్వదించాలని మంత్రి అంబటి రాంబాబు కోరారు. గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మేనిఫెస్టోకి చారిత్రాత్మక విశ్వసనీయతను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమాల నాగార్జున యాదవ్,గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమకాయల రాజనారాయణ, జిల్లా గ్రంధాలయాల సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి, నాయకులు కళ్ళంవిజయభాస్కరరెడ్డి, చిలుకా జైపాల్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులున్నారు.

పేదల పక్షాన పోరాడుతున్న సీఎం జగన్

ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌నాయుడు

నాదెండ్ల: కురుక్షేత్ర సంగ్రామంలో పేదల పక్షాన పోరాడుతున్నది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కడేనని నరసరావుపేట పార్లమెంటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి అనిల్ కుమార్ యాదవ్ చెప్పారు. మండలంలోని ఇర్లపాడు, గణపవరం, నాదెండ్ల గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జ్ఞానేశ్వర ఫౌండేషన్ అధినేత షేక్ జాన్‌సైదాతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మూడు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. మెయిన్‌రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతీయ రహదారి వద్ద నుండి కొత్త రామాలయం వద్దకు చేరుకుని అక్కడ జరిగిన సభలో మాట్లాడారు. 13న జరిగే ఎన్నికల్లో పేదలకు, పెత్తందారులకు మధ్య పోరాటంలో మీ కుటుంబానికి మంచి జరిగిందంటేనే ఓటేయాలని అడుగుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగమనోహర్‌నాయుడు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతి లేని పాలన సాగిస్తూ కులం, మతం, వర్గ విబేధాలు లేకుండా ప్రతి ఇంటికీ సంక్షేమం అందుతున్నాదన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో రైతులు, డ్వాక్రా మహిళలకు ఋణమాఫీ చేస్తానన్న హామీ నెరవేర్చలేదని, అమలు కాని హామీలతో అడ్డదిడ్డంగా మేనిఫెస్టోతో ప్రజల్ని మరోసారి మోసగించేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మస్తాన్‌రావు, మార్కెట్‌యార్డు చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, ఇర్లపాడు సర్పంచ్ రమాదేవి, గణపవరం సొసైటీ చైర్మన్ మంగు ఏడుకొండలు, జేసీఎస్ కన్వీనర్ అల్లడి రవికుమార్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్లు తోట రాజేంద్రప్రసాద్, మద్దిరాల విశ్వనాధం, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గణపవరం పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, కౌన్సిలర్లు తులం సుధాకర్, సాగర్‌బాబు, ఆదంవలి, కాటా వెంకటేశ్వర్లు, కె రామకృష్ణ, గొర్రె శివ, విక్రమ్‌రాజు, బొల్లయ్య పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



రెంటచింతలలో ప్రచార రథంపై నుంచి అభివాదం చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని మరో సారి జగనన్నకు మీ చల్లని ఆశీస్సులు అందచేసి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రెంటచింతలలో ఆయన ప్రచార రథంపై ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. జగనన్నతోనే ప్రజల సంక్షేమం సాధ్యమని, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, పేదలకు మంచి జరగాలన్నా జగనన్నకు మనందరం అండగా ఉండాలన్నారు. రెంటచింతల గ్రామం అంటే ప్రత్యేక అభిమానమని 2019 సార్వత్రిక ఎన్నికలలో గ్రామస్తులు 2,501 ఓట్ల భారీ మెజారిటీని అందిచి తనకు అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. జగనన్న పాలనలో గ్రామంలో రూ. 4.10 కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణం, రూ. 1.20 కోట్లతో 3 గ్రామ సచివాలయాలు, రూ. 65.40 లక్షలతో 3 రైతుభరోసా కేంద్రాలు, రూ. 41.60 లక్షలతో రెండు వైఎస్సార్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాడు–నేడు పథకం కింద గ్రామంలో రూ. 94 లక్షలతో అభివృద్ధి పనులు, రూ.50 లక్షలతో ముస్లీం మైనార్టీలకు, మరో రూ.40 లక్షలతో క్రిస్టియన్ మైనార్టీలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మించారు. బాబును నమ్మితే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయన్నారు. బాబు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన ఫ్యాన్ ప్రభంజనాన్ని అపలేరన్నారు. ఓటమి భయంతోనే టీడీపీ నేతలు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని, వారికి ప్రజలు ఓటు అనే యుధంతోనే బుద్ధి చేప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ముందుగా గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో, ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేర్ల చౌడమ్మ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి పల్లెర్ల రాంబాబు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు పూజల రామయ్య, జేసీఎస్ కన్వీనర్ మోర్త ఉమ, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు మర్రి లూర్దురాజు, మండల యూత్ అధ్యక్షులు కొమ్మారెడ్డి సతీష్‌రెడ్డి, పార్టీ నేయకులు తుమ్మా ఇన్నారెడ్డి, పేర్ల ముత్తయ్య, కట్టమూరి నాగేశ్వరరావు, గుజ్జుల సైదారెడ్డి, పల్లెర్ల కోటిరెడ్డి, బద్దూరి బ్రహ్మారెడ్డి, ఏలూరి సగ్యం, డేగల సంసోన్, బి. తిరుపతిరావు, బత్తుల దేవ, పులి ఓబుల్‌రెడ్డి, దేవిరెడ్డి నారపరెడ్డి తదితరులున్నారు.

భారీ ర్యాలీతో ఎమ్మెల్యే శంకరరావుకు స్వాగతం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



అచ్చంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా గత 59నెలలుగా సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు కృతజ్ఞతా పూర్వకంగా కదంతొక్కారు. అన్ని వర్గాలకు చెందిన ప్రజలు సీఎం జగన్‌మోహనరెడ్డికి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు తమ అభిమానాన్ని చాటుకునేందుకు 800బైకులు, 100కు పైగా ట్రాక్టర్లతో శుక్రవారం రాత్రి తాళ్లచెరువు, అచ్చంపేట గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు అఖండ స్వాగతం పలికారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన 8వేలకు పైగా అభిమానులు భారీ ర్యాలీలో పాల్గొన్నారు. కనకతప్పట్లతో, బాణాసంచా కాలుస్తూ కొనసాగిన ర్యాలీ అచ్చంపేటలో పార్టీ కార్యాలయం నుంచి పాత సినిమాహాలు సెంటర్, వైఎస్సార్ విగ్రహసెంటర్, పాతబ్యాంకు సెంటర్, పాలకేంద్రసెంటర్ మీదుగా సాయిబాబా గుడి వరకు కొనసాగింది. తాళ్లచెరువులో గ్రామ ప్రవేశం నుంచి చర్చి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు పార్టీ జండాలు చేతబట్టి జై జగన్ నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు.

మీ అభిమానానికి కృతజ్ఞతగా ఉంటా : ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

మీరు చూపిస్తున్న అభిమానానికి అండగా ఉంటా..జగనన్నబాటలోనే నడుస్తా.. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తా... ఫ్యానుగుర్తుపై ఓటువేసి గెలిపించండి.. మనమంతా సీయం జగన్‌మోహనరెడ్డికి అండగా ఉందామని అన్నారు. జగనన్న సీయం అయితేనే సంక్షేమ పథకాలు మొత్తం కొనసాగుతాయన్నారు. నిరుపేదల జీవితాలలో జగనన్న వెలుగులు నిండుతాయి. సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు సుఖశాంతులతో ఉంటారని ఎమ్మెల్యే శంకరరావు అన్నారు. చంద్రబాబును నమ్ముకుంటే భవిష్యత్ అంధకారమేనన్నారు. అబద్దపు అలవికాని హామీలతో కూటమీ పేరుతో మళ్లీ మోసం చేయడానికి వచ్చే బాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సుపర్ సిక్స్‌లు, సూపర్ సెవెన్‌లు ఓ అభూత కల్పన అని అన్నారు. జగన్ చెప్పేవి ఇచ్చితంగా చేస్తాడని, చేయగలిగేవే చెబుతాడన్నారు. నియోజకవర్గంలో అయిదు సంవత్సరాల క్రితం పరిస్థితులు ఎలా ఉన్నాయి, ఇప్పుడెలా ఉన్నాయో ఆలోచించాలన్నారు. గ్రామ గ్రామాన జరిగిన అభివృద్ధిని ఒక్కసారి గుర్తుచేసుకోవాలన్నారు. అందుకుంటున్న సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని జ్ఞప్తికి తెచ్చుకోవాలన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో మొదటి నెంబరులో ఉండే ఫ్యాను గుర్తుకు వోటు వేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ పార్టీ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ గ్రామాలనుంచి అసంఖ్యాకంగా తరలి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

ఆదుకోవాల్సింది పోయి అణగదొక్కేలా కుట్ర

చిలకలూరిపేట: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిని ఆదుకోవాల్సింది పోయి ఉన్న 4శాతం రిజర్వేషన్‌ను రద్దు చేస్తామంటూ బీజేపీ నేతలు చెప్పడం దారుణమని గుంటూరు జిల్లా జామాయతే ఉలేమా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఉస్మాన్ సాహెబ్ ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని వేలూరు రోడ్డులోని అబ్బాస్‌నగర్‌లో జమాయితే ఉలేమా ప్రతినిధులు శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశస్వాతంత్ర్య సాధనలో త్యాగాలు చేసిన మహనీయుల్లో ఈదేశ ముస్లింలు ఉన్నారని, వారికి చేయుత నివ్వాల్సిన కేంద్రం ప్రత్యేకించి అణగదొక్కే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై తప్పుడు ప్రచారం

ఎన్నికల ప్రచారంలో మీడియాతో ఎమ్మెల్యే గోపిరెడ్డి



ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 20వ వార్డు రామిరెడ్డిపేట, 14వ వార్డు ప్రకాష్‌నగర్ కంభంపాలెంలో పర్యటించారు. ప్రచారం రథంపై నుంచి ఇంటింటికీ తిరుగుతూ పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్‌తో పాటు తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ చట్టాన్ని తీసుకొచ్చింది కేంద్ర ప్రభుత్వమని, సీఎం జగన్ భూములు లాక్కునేందుకు ఈ చట్టం తీసుకొచ్చారని చెబుతున్నారని, ఎన్నికలకు ముందు ఈ పని ఎవరైనా చేస్తారా అని ప్రశ్నించారు. ఓడిపోతున్నామనే ఆలోచనతో టీడీపీ నాయకులు ఈ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు వల్ల పింఛన్‌దారులు అందరూ ఇబ్బందులు పడుతున్నారని, ఆయనకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ ఎస్.ఏ.హనీఫ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుంచాల రోశమ్మ, కుంచాల కోటేశ్వరరావు, డాక్టర్ ఓరుగంటి శేషిరెడ్డి, నవులూరి శ్రీకాంతరెడ్డి, చల్లా హనుమంతరావు, తలారి నాని, పాతర్ల చిన్ని, బండి వెంకటేశ్వరరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం, నగదు అక్రమ రవాణాను నిరోధించండి

ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు నీనా నిగం



కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశంలో నీనానిగం

నరసరావుపేట: ఎన్నికల నిర్వాహణలో స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అప్రమత్తంగా ఉంటూ మద్యం, నగదు అక్రమ రవాణా నిరోధించేలా తనిఖీలు చేపట్టాలని ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు నీనానిగం అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల వ్యయంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని, ద్విచక్ర వాహనాలు, కార్లలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు చేసేటప్పుడు సంబంధిత కండక్టర్, డ్రైవర్ల సీట్లు, బ్యాగులను పరిశీలించాలన్నారు. బ్యాంకు యూపీఐలపై దృష్టిపెట్టి అవసరమైన చోట చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్ జిల్లా చెక్‌పోస్టుల వద్ద ట్రాన్సిట్ పర్మిట్లను పరిశీలించి వాటి ఎక్స్‌పైరీ డేట్‌ని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీల సమయంలో రెండు వైపుల నుంచి వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. ఫ్రీ బీస్ విషయంలో టోకెన్లు పంపిణీ నిరోధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యస్ఈబీ అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ఉండేలా అందరూ సహకరించాలని కోరారు. మద్యం షాపుల్లో రోజువారీ స్టాకును పరిశీలించాలని, అక్రమంగా నిల్వ ఉంచడం, తరలించడం జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు సుమిత్ కుమార్, జార్జ్ జోసఫ్, గౌతమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత ఆమె కలెక్టర్ కార్యాలయంలోని మీడియా సెంటర్ పరిశీలించారు.

పల్నాడులో మళ్లీ ఫ్యాన్ ప్రభంజనం



నరసరావుపేట పార్లమెంట్ మ్యాప్

మరోసారి క్లీన్‌స్వీప్ దిశగా వైఎస్సార్ సీపీ

- గత ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకున్న వైఎస్సార్ సీపీ
- మరోసారి జిల్లాలో ఖాయమైన ఫ్యాన్ విజయం
- నరసరావుపేట, పెదకూరపాడు, మాచర్లలో అధికారపార్టీ హవా
- గురజాల, వినుకొండలలోనూ ఇదే పరిస్థితి
- గెలుపుబాట పట్టిన సత్తెనపల్లి, చిలకలూరిపేట
- తొలి బీసీ ఎంపీగా రికార్డు సృష్టించనున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి అనిల్ యాదవ్
- జగనన్న ఐదేళ్లపాలనపై అన్నివర్గాలలో సానుకూలత
- సామాజిక సమీకరణలకు పెద్ద పీట
- వైఎస్సార్ సీపీ గెలుపు నల్లేరుపై నడకేనంటున్న రాజకీయ పరిశీలకులు

సాక్షి, నరసరావుపేట: పల్నాడు ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ అంటే ఎనలేని అభిమానం, ఆ అభిమానంతోనే 2019 ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేశారు. తెలుగుదేశం పార్టీ అడ్రస్ గల్లంతైంది. ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పాలనతో మరోసారి 2019 ఫలితాలే 2024 ఎన్నికల్లో పునరావృతమవుతాయన్న భావన అందరిలోను నెలకొంది. వైఎస్సార్ సీపీ పాలనపై అన్నివర్గాల ప్రజలు సానుకూలంగా ఉన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా అన్ని సామాజికవర్గాలకు సముచిత స్థానం కల్పించడంతో వైఎస్సార్ సీపీ గెలుపు నల్లేరుపై నడకేనంటున్నారు రాజకీయ పరిశీలకులు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి కార్యక్రమాలు ఈ ఐదేళ్లలో జరగడం, ముఖ్యంగా గ్రామాల రూపురేఖలు మారడం ప్రజల్లో జగన్ పాలనపై సానుకూలత ఏర్పడింది.

మళ్లీ కాసుకే పట్టం



గురజాలలో వైఎస్సార్ సీపీ తరఫున కాసు మహేష్ రెడ్డి, టీడీపీ తరఫున యరపతినేని శ్రీనివాసరావు బరిలో నిలిచారు. అధికారంలో ఉన్నప్పుడు మైనింగ్‌తో ప్రభుత్వ ఆస్తిని విచ్చలవిడి దోపిడీ చేసి రూ. వందల కోట్ల దోచుకొని సీబీఐ కేసులు ఎదుర్కొంటున్న యరపతినేని పట్ల గురజాల ప్రజలు విముఖంగా ఉన్నారు. 2014–19 మధ్య ప్రజల ఆస్తులను దౌర్జన్యంగా లాక్కొని చేసిన అరాచకాలను ఇప్పటికి నియోజకవర్గ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. దీంతో యరపతినేనిని మరోసారి ఓడించి పర్మినెంట్‌గా గుంటూరు నగరానికే పరిమితం చేయాలని ఓటర్లు భావిస్తున్నారట. మరోవైపు 2019 ఎన్నికల్లో గెలిచిన కాసు మహేష్‌రెడ్డి ఓవైపు ప్రజలకు భరోసా నిస్తూనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరువ చేశారు. పిడుగురాళ్లలో మెడికల్ కళాశాల, వాటర్ గ్రిడ్ పనులు, నేషన్ హైవేలు, బైపాస్‌రోడ్ల నిర్మాణం వంటివాటితో తన మార్కు పనితీరును కాసు చూపారు. దీంతో మరోసారి గురజాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్న సంకేతాలు వినిపిస్తున్నాయి.

పీఆర్కేకు ఎదురేలేదు



మాచర్లలో వైఎస్సార్ సీపీ తరఫున పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ తరఫున జూలకంటి బ్రహ్మారెడ్డి పోటీ పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజల 70 ఏళ్ల చిరకాల కల అయిన వరికపూడిసెల ప్రాజెక్టు పనులు ప్రారంభించి వైఎస్సార్ సీపీ, పీఆర్కేలు ప్రజల మనసు గెలుచుకున్నారు. మరోవైపు జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో ఇక్కడి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర అన్నివర్గాల ప్రజలు పెద్దఎత్తున లబ్ధి పొందారు. దీంతో ఈ ఎన్నికల్లో ఇక్కడ ఉన్న ప్రజల ఓట్లు అధికారపార్టీ అభ్యర్థికి పడనున్నాయి. ఇప్పటికే నాలుగుసార్లు వరుసగా గెలిచి ఐదోసారి భారీ మెజార్టీతో గెలవడానికి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సిద్ధంగా ఉన్నారని అన్ని సర్వేలలో తేటతెల్లమవుతోంది. తెలుగుదేశం పార్టీ పరిస్థితి మాత్రం మరోలా ఉంది. 2004 నుంచి ఇక్కడ టీడీపీ గెలిచింది లేకపోగా ప్రతి ఎన్నికలకు ఓ కొత్త అభ్యర్థిని తెరమీదకు వచ్చి తెరమరుగవుతున్నారు. దీంతో మాచర్లలో పీఆర్కేకు మరోసారి ఎదురులేదన్నది స్పష్టమవుతోంది.

వినుకొండలో వైఎస్సార్ సీపీదే గెలుపు



వినుకొండ నియోజకవర్గంలో అధికారపార్టీ తరఫున బొల్లా బ్రహ్మనాయుడు, టీడీపీ తరఫున జీవీ ఆంజనేయులు పోటీ పడుతున్నారు. ఇక్కడ నుంచి 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన బొల్లా గతంలో ఎన్నడూ లేని విధంగా వినుకొండలో అభివృద్ధి పనులు చేపట్టారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం, రోడ్ల విస్తరణ, రైల్వే అండర్‌పాస్‌లు నిర్మాణం, కొండపై దేవాలయం అభివృద్ధి, భూకబ్జాలకు అడ్డుకట్ట వేయడం వంటి కారణాలతో బొల్లాకు ప్రజలు జై కొడుతున్నారు. నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉన్న బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందడంతో వైఎస్సార్ సీపీకి తమ పూర్తి మద్దతు తెలుపుతున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గతంలో చేసిన అరాచకాలు, అక్రమాలు వెంటాడుతున్నాయి. ఈ నియోజకవర్గంలో గత ప్రభుత్వకాలంలో జన్మభూమి కమిటీల పేరిట చేసిన ఘోరాలు తలుచుకొని మరోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడుని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

అసెంబ్లీలో అడుగుపెట్టనున్న కావటి



చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున కావటి మనోహర్‌నాయుడు, టీడీపీ తరఫున ప్రత్తిపాటి పుల్లారావులు పోటీ పడుతున్నారు. మంత్రిగా ఉన్న సమయంలో ప్రత్తిపాటి పుల్లారావు అరాచకాలు, అక్రమాలు అన్ని ఇన్నీ కావు. ప్రజలతోపాటు సొంత పార్టీలో సైతం పుల్లారావుకు వ్యతిరేకత బలంగా ఉంది. పుల్లారావును మరోసారి ఓడించి రాజకీయ జీవితాన్ని ముగించాలని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు. ముస్లీం, కాపు, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉండటం అధికారపార్టీకి అనుకూలం. మరోవైపు ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనలో కులం, మతం వర్గం చూడకుండా ప్రభుత్వ పథకాల లబ్ధి కలగడంతో అన్ని వర్గాల నుంచి వైఎస్సార్ సీపీకి మద్దుత లభిస్తోంది. నియోజకవర్గంలో మంచి పట్టున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ జోరుగా ప్రచారం చేయడం కావటికి ప్లస్ అయ్యింది. దీంతో తొలిసారి పోటీ చేస్తున్న కావటి మనోహర్ అసెంబ్లీ మెట్లు ఎక్కే అవకాశాలు బలంగా ఉన్నాయని వినిపిస్తోంది.

సత్తెనపల్లిలో సై అంటున్న అంబటి



సత్తెనపల్లిలో వైఎస్సార్ సీపీ తరఫున అంబటి రాంబాబు, టీడీపీ తరఫున కన్నా లక్ష్మీనారాయణ పోటీ చేస్తున్నారు. కన్నా లక్ష్మీనారాయణ కాలం చెల్లిన రాజకీయాలు చేస్తుండటం, గతంలో టీడీపీ అధినేత చంద్రబాబుపై దశాబ్దాలు పోరాడిన చరిత్ర ఉండటంతో ఆ పార్టీ అభిమానుల నుంచి తగిన మద్దతు లభించడం లేదు. ఈ స్థానంలో పోటీ చేయాలని చూసి భంగపడ్డ కోడెల శివరాం, మల్లి, వైవీ ఆంజనేయుల వర్గాలు కన్నా ఓటమికి లోలోపల పనిచేస్తున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా టీడీపీలో ప్రధాన సామాజికవర్గం కన్నా గెలుపునకు సహకరించకూడదని నిర్ణయించనట్టు తెలుస్తోంది. మరోవైపు మంత్రి అంబటి రాంబాబు చేసిన పలు అభివృద్ధి పనులు ఆయనను మరోసారి గెలిపించేందుకు ఉపయోగపడనున్నాయి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో అందిన సంక్షేమ ఫలాలు అంబటి గెలుపునకు శ్రీరామరక్ష కానున్నాయి.

'నంబూరు' గెలుపు నల్లేరుపై నడకే..



పెదకూరపాడు నుంచి వైఎస్సార్ సీపీ తరఫున నంబూరు శంకరరావు, టీడీపీ తరఫున భాష్యం ప్రవీణ్‌లు పోటీ చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బెల్లంకొండ–అమరావతి రోడ్డు, కృష్ణానదిపై బ్రిడ్జిలు, పెద్దస్థాయిలో ఆసుపత్రుల, విద్యాసంస్థల భవనాల నిర్మాణాలతో పెదకూరపాడులో అభివృద్ధి అంటే ఎంటో పరిచయం చేసినట్టు అయ్యింది. మరోవైపు శంకరరావు కుటుంబం చేస్తున్న సేవాకార్యక్రమాలు ఆయన గెలుపునకు దోహదపడుతున్నాయి. గతంలో ఎమ్మెల్యేగా చేసిన సీనియర్ నేత కొమ్మాలపాటి శ్రీధర్‌కు కాదని భాష్యం ప్రవీణ్‌కు టీడీపీ టికెట్ ఇవ్వడం ఇబ్బందికరంగా మారు తోంది. శ్రీధర్ వర్గంకు, మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలు ఏమాత్రం సహకరించకపోవడం భాష్యంను భయపెడుతోంది. మరోవైపు ప్రవీణ్ అహంకార ప్రవర్తనతో సొంతపార్టీ నేతలే ఛీదరించుకుంటున్నారు. దీంతో రూ.కోట్లు గుమ్మరించి గెలుద్దామని ఆశగా వచ్చిన ప్రవీణ్ ఓటమి మూటగట్టుకోవాల్సిందేనన్న వాదన నియోజకవర్గంలో బలంగా వినిపిస్తోంది.

తొలి బీసీ ఎంపీగా అనిల్ యాదవ్



రాజకీయంగా ప్రతిష్టాత్మకమైన నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, టీడీపీ తరఫున లావు శ్రీకృష్ణదేవరాయలు పోటీ చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీగా గెలిచి రాజకీయ భిక్షపెట్టిన పార్టీకి ద్రోహంచేసి టీడీపీలోకి వెళ్లిన నమ్మకద్రోహి లావు శ్రీకృష్ణదేవరాయలను జిల్లా ప్రజలు ఛీదరించుకుంటున్నారు. బీసీకి అవకాశం ఇస్తే సహించని లావుకు బుద్ధి చెబుతామని జిల్లాలోని బీసీలంతా ఏకమయ్యారు. క్రాస్ ఓటింగ్ లావును ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. టీడీపీలోకి వెళ్లిన లావుకు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి ఏమాత్రం సహకారం అందడం లేదు. దీంతో ఎందుకు పార్టీ మారానా అని మదనపడుతున్నట్టు తెలుస్తోంది. నరసరావుపేట పార్లమెంట్ చరిత్రలో ఇప్పటివరకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ఎంపీగా గెలిచింది లేదు. దీన్ని మార్చాలన్న ఉద్దేశంతో బడుగు బలహీనవర్గాలకు చెందిన మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కు సీఎం వైఎస్ జగన్ అవకాశం ఇచ్చారు. దీంతో జిల్లాలోని యాదవులతో పాటు అన్ని బీసీ వర్గాలు ఆయన్ను అక్కున చేర్చుకుంటున్నాయి. దీంతో తొలి బీసీ వర్గానికి చెందిన ఎంపీగా అనిల్ గెలిచి చరిత్ర సృష్టించడ ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

హ్యాట్రిక్ దిశగా గోపిరెడ్డి



నరసరావుపేటలో వైఎస్సార్ సీపీ తరఫున గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, టీడీపీ తరఫున చదలవాడ అరవింద్‌బాబులు పోటీ చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికైన పల్నాడు జిల్లా ఏర్పాటుతోపాటు జిల్లా కేంద్రంగా నరసరావుపేట చేయడంపై ప్రజలు వైఎస్సార్ సీపీకి జై కొడుతున్నారు. జేఎన్‌టీయూ కళాశాల భవనం, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, కేంద్రీయ విద్యాలయం, జిల్లా ఆసుపత్రి మౌలిక వసతుల కల్పన, ఆటోనగర్ వంటి అభివృద్ధి పనులతో పాటు రూ.వేల కోట్ల సంక్షేమ ఫలాలు ప్రజలకు ఎటువంటి వివక్ష లేకుండా అందాయి. గత రెండు ఎన్నికల్లో విజయం సాధించి, మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ కొట్టేందుకు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సిద్ధమవుతున్నారు. నరసరావుపేటలో గత 20 ఏళ్లుగా టీడీపీ గెలుపు ముఖం చూడలేదు. ఈ స్థానంలో టీడీపీ తరఫున ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న చదలవాడ అరవింద్‌బాబుకు టీడీపీలోని ప్రధాన సామాజిక వర్గాలు, నేతలు సహకారం అందించడం లేదు. దీంతో అరవింద్‌బాబు సైతం చేతులెత్తేశారని ప్రచారం సాగుతోంది. దీంతో నరసరావుపేట గడ్డ...వైఎస్సార్ సీపీ అడ్డా అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నేటితో ప్రచారానికి ఆఖరు

- సాయంత్రం 6 గంటలకు ముగియనున్న ఎన్నికల ప్రచారం
- ఓటర్లను ప్రసన్నం చేసుకోవటానికి మిగిలింది ఇక కొన్ని గంటలే..
- ఇంటింటా ప్రచారాలు, మైక్ సెట్లు, బహిరంగసభలకు నేడు ఆఖరి రోజు
- ప్రచారానికి వచ్చిన బయటి వ్యక్తులు నియోజవర్గం దాటి వెళ్లాల్సిందే

సాక్షి, నరసరావుపేట: హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం మరికొన్ని గంటల్లో ముగియనుంది. ఈ నెల 13వ తేదీన పోలింగ్ జరుగుతున్నందున నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారం నిలిపివేయాల్సి ఉంటుంది. దీంతో నేటి సాయంత్రం 6 గంటల వరకే ప్రచారానికి అనుమతి ఉంది. నేటి సాయంత్రం నుంచి పోలింగ్ రోజువరకు జిల్లాలో మద్యం దుకాణాలు మూసి ఉంటాయి. దీంతో ముందస్తు వ్యూహంతో టీడీపీ నేతలు భారీ స్థాయిలో మద్యం నిల్వలు సమకూర్చుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మద్యం, డబ్బు ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి ఎన్నికల అధికారులు, పోలీస్ యంత్రాంగం పటిష్ట నిఘా ఉంచినా యంత్రాంగం కళ్లుగప్పి తమపని తాము చేసుకుపోవడానికి అభ్యర్థులు రెడీ అవుతున్నట్లు సమాచారం. సమయం తక్కువగా ఉండటంతో ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకోవటానికి వీలున్న అన్నిమార్గాల్లో అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

- జిల్లాలో అభ్యర్థుల ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. ఆ తర్వాత మైకులు, ప్రచారాలు, ప్రసంగాలు ఉండరాదని, డప్పుల మోతలు ఉండరాదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ప్రచారం కోసం వచ్చిన బయటి వ్యక్తులు సైతం సాయంత్రానికల్లా నియోజకవర్గం విడిచి వెళ్లిపోవాలని జిల్లా ఎన్నికల అధికారులు ఆదేశించారు. ప్రచార పర్వం తర్వాత, పోలింగ్ సమయానికి ముందున్న 48 గంటల పాటు జిల్లాలో ప్రలోభాల పర్వం జోరుగా సాగనున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.
- ఇప్పటిదాకా ఇంటింటి ప్రచారంపై దృష్టి పెట్టిన అభ్యర్థులు నేడు పట్టణాలు, ఆయా మండల కేంద్రాల్లో పర్యటించేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇంటింటి ప్రచారం చేస్తే ఉన్న సమయం వృథా అవుతుందన్న కోణంలో ఆలోచిస్తున్నారు. అందుకే మండల కేంద్రాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో రోడ్‌షోలు, ముఖ్యనాయకులతో సమావేశాలు నిర్వహించనున్నారు.
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో గత ఐదేళ్లుగా ప్రజలకు చేసిన మంచిని వివరించేందుకు నియోజవర్గంలోని ప్రతి ఇంటిని రెండు, మూడు దఫాలు చుట్టి రావటంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో నిలిచారు.

ముందే చేతులెత్తేశారు..!

- నరసరావుపేటలో ఓటమిని అంగీకరించిన టీడీపీ నేతలు
- కాసులు లేవని బాబు పర్యటన వాయిదా
- మాచర్లలోనూ జనం లేక వర్షం సాకుతో వాయిదా

నరసరావుపేట టౌన్: ఎలాగూ ఓడిపోయే సీటే కదా.. ఇంక ఖర్చు పెట్టడం ఎందుకు దండగ.. ఉన్న రూపాయినైనా జాగ్రత్త చేసుకుందాం. ఇదీ నరసరావుపేటలో తెలుగుదేశం పార్టీ నాయకుల మనసులో మాట. వీరు అనుకున్నట్లుగానే ఆచరణలోనూ చేసి చూపిస్తున్నారు. చివరకు పార్టీ అధినేత చంద్రబాబు పర్యటనను కూడా కాసుల కారణం చూపి రద్దు చేయించేశారు.

- పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో తెలుగుదేశం పార్టీ తరఫున చదలవాడ అరవింద్ బాబు పోటీ చేస్తున్నారు. ఈయన సీటు తెచ్చుకోవడానికి మొదటి నుంచీ ఆపసోపాలు పడాల్సి వచ్చింది. సీటు ప్రకటించిన తర్వాత బీఫారం అందుకోవడానికీ చుక్కలు కనిపించాయి. వాస్తవంగా ఈనెల 5వ తేదీన నరసరావుపేటలో చంద్రబాబు సభ జరగాల్సి ఉంది. వాయిదా వేసి 10వ తేదీకి మార్చారు. ఖర్చును లెక్కలు వేసుకుని శుక్రవారం జరగాల్సిన సభను కూడా వాయిదా వేయించారు. చంద్రబాబు పర్యటనకు వస్తే సుమారు రూ.కోటి వరకు ఖర్చవుతుందని, ఇది భరించే శక్తి తన వద్ద లేదని చదలవాడ చేతులెత్తేశారని వినికిడి.
- ఇదే విషయాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దృష్టికి అరవిందబాబు తీసుకెళ్లినట్టు సమాచారం. ఆయన కూడా బాబు పర్యటన భారాన్ని మోసేందుకు వెనకడుగు వేశారు. ఇప్పటికే తనకు ఖర్చు తడిచి మోపెడవుతోందని, ఇది తన వల్ల కాదని చేతులెత్తేశారని టాక్.. ఇది తెలిసిన కేడర్ ఇక మనకు ఓటమి తప్పదని ముందే డిసైడ్ అయిపోయారు.

జనం లేక మాచర్ల సభ వాయిదా...

మాచర్లలో నిర్వహించనున్న చంద్రబాబు సభకు ఆశించినంత జనం రాలేదు. జనసమీకరణ చేయడంలో పార్టీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి విఫలమయ్యాడు. విషయం తెలుసుకున్న చంద్రబాబు మాచర్ల పర్యటనను వాయిదా వేసుకున్నాడు. గన్నవరంలో వర్షం రావడంతో చంద్రబాబు పర్యటన ఆలస్యమయిందనే సాకును చెప్పారు. అయితే వాస్తవం తెలిసిన తెలుగు తమ్ముళ్లు ఎన్నికలకు మూడు రోజుల ముందు జనం లేక చంద్రబాబు సభ వాయిదా పడటంపై మథన పడుతున్నారు.

ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోండి

ట్రాన్స్‌జెండర్లకు రక్షాబంధన్ కట్టి ఓటేయాలని కోరిన జిల్లా ఎన్నికల అధికారి



నరసరావుపేట: ఓటుహక్కు కలిగిన వారందరూ వారి ఓటుని నిర్భయంగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్ కోరారు. శుక్రవారం సాయంత్రం స్వీప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక గాంధీపార్కు వద్ద ట్రాన్స్‌జెండర్లలో ఓటు హక్కుపై భరోసా కల్పిస్తూ వినూత్నంగా మీ ఓటుకై మా భరోసా రక్షాబంధనం కట్టి అవగాహన కల్పించారు.

పేదల పక్షాన యుద్ధం చేస్తున్నాం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



రాజుపాలెం: పేదల పక్షాన పెత్తందారుల కుట్రల కూటమితో ముఖ్యమంత్రి యుద్ధం చేస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని రామిరెడ్డిపేట, కొండమోడు, అంచులవారిపాలెం గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో ప్రజల విశ్వాసాన్ని చూరగొనిందన్నారు. కూటమి ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మడం లేదన్నారు. 2014లో ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదని చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలని కలలు కంటున్నారని అన్నారు. విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన జగనన్నను గెలిపించాల ని అభ్యర్థించారు. ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి తనను, పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. తొలుత మహిళలు హారతులుపట్టి ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మిర్చియార్డు చైర్మన్ రాజనారాయణ, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ హరి సూరమ్మ నాగేశ్వరరావు, ఎంపీటీసీ మేరీ, ఏఎంసీ మాజీ చైర్మన్ తోట మోహన్‌రావు పాల్గొన్నారు.

అనిల్ అనే నేను..



ప్రమాణ పూర్తిగా చెబుతున్నా..

- పల్నాడు ప్రజల అభ్యున్నతి, వికాసం, సంక్షేమానికి పాటుపడతా
- ఈ ప్రాంత అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో పోరాడుతా
- వరికపూడిశెల ప్రాజెక్టు పూర్తి నా మొదటి ప్రాధాన్యత
- రైల్వే లైన్లు, అండర్ బ్రిడ్జిలు మంజూరుకు కృషి
- రైతులు, యువతకు మేలు జరిగేలా ప్రాజెక్టులు తెస్తా
- నరసరావుపేట పార్లమెంటును అన్నివిధాల అభివృద్ధి చేస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్

" దేవుడి దయ, జగనన్న సంకల్పంతో నాకు నరసరావుపేట ఎంపీగా పోటీ చేసే అవకాశం వచ్చింది. నెల్లూరు నుంచి వస్తున్నప్పుడు పల్నాడు ప్రజలు ఎలా స్వీకరిస్తారో అన్న చిన్నపాటి సందేహం మదిలో ఉండేది. అయితే ఈ ప్రాంత ప్రజలు నన్ను సొంత బిడ్డలా అభిమానిస్తున్నారు. ఎక్కడికెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారు. జగనన్న ప్రతినిధిగా వచ్చిన నీకు మేము అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ ప్రజల ప్రేమాభిమానాలు జీవితాంతం మరిచిపోలేను. రానున్న ఎన్నికల్లో ఖచ్చితంగా ఎంపీగా గెలవబోతున్నాను, గెలిచిన తరువాత పల్నాడు ప్రజల అభ్యున్నతి, వికాసం, సంక్షేమానికి పాటుపడతానని, ఈ ప్రాంత అభివృద్ధికి పార్లమెంట్‌లో పోరాడుతానని అనిల్ అనే నేను ప్రమాణం చేస్తున్నాను. " అని నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్. పి.అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. – సాక్షి, నరసరావుపేట

సాక్షి ఇంటర్వ్యూ

వైఎస్సార్ సీపీ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో స్థానిక ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేయడం మేలు చేసింది. రానున్న ఐదేళ్లు ఎంతో కీలకం.. మరోసారి పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి జరగనుంది.

- నేను ఎంపీగా గెలవగానే వరికపూడిశెల ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేస్తాను.
- కేంద్ర రైల్వే శాఖతో సమన్వయం చేసుకొని కొత్త రైల్వే లైన్లు, రైల్వే అండర్ బ్రిడ్జిలు మంజూరు చేయిస్తాను.
- ఈ ప్రాంత రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయించి రైతులతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాను.
- కొత్త స్పైసెస్, టెక్స్‌టైల్ పార్కుల మంజూరుకు కృషి. ముఖ్యంగా అధ్యాత్మిక, ఆహ్లాద పర్యాటకం అభివృద్ధికి కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తీసుకువచ్చి పర్యాటకంగా అభివృద్ధి చేస్తాను.
- పురోగతిలో ఉన్న నేషనల్ హైవేల నిర్మాణం పూర్తి చేయించి, కొత్త రోడ్లు మంజూరుకు కృషి చేస్తాను.
- పిడుగురాళ్ల మెడికల్ కళాశాలలో అందుబాటులోకి తేవడంతోపాటు అన్ని మండలాల్లో వైద్య సేవలు మెరుగుపడేలా చేస్తాను.
- పల్నాడులో ప్రతి గ్రామానికి తాగునీటి వసతిని కల్పించేందుకు కృషి చేస్తాను.
- స్థానిక ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకొంటూ అన్ని పనులు పూర్తి చేస్తాం.

నా గెలుపు బీసీల గెలుపుగా భావిస్తున్నారు

నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడాన్ని అపూర్వ అవకాశంగా భావిస్తున్నాను. ప్రచారంలో భాగంగా వెళ్లినప్పుడు అన్ని నియోజకవర్గాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఏడు అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవబోతున్నారు. మరోసారి పల్నాడు జిల్లాను క్లీన్‌స్వీప్ చేయబోతున్నాం. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నరసరావుపేట ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయించి జగనన్న కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. దీంతో బడుగు, బలహీనవర్గాలు నన్ను అక్కున చేర్చుకుంటున్నారు. నా గెలుపును బీసీల గెలుపుగా భావించి ప్రతి ఒక్కరూ సైనికుల్లాగా పనిచేయడం చాలా ఆనందంగా ఉంది.

పల్నాడు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక...

వెనుకబడిన ప్రాంతంగా పేరుపొందిన నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో గత ఐదేళ్ల

మీతోనే ఉంటా...



అనిల్ అనే నేను మీ సేవకుడిగా పనిచేస్తాను. ఎప్పుడూ మీతోనే ఉంటా. మీకు ఏ అవసరం వచ్చినా అర్ధరాత్రి వచ్చి తలుపు తట్టినా ఆలకించడానికి సిద్ధంగా ఉంటా. పల్నాడు అభివృద్ధికి రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వాల మధ్య వారధిలా పనిచేసి నావంతు కృషి చేస్తాను. బీసీ బిడ్డగా ఆయా వర్గాల అభ్యున్నతికి ప్రత్యేకంగా కృషి చేస్తాను. ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ఈ ప్రాంత ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. మరోసారి అఖండ మెజార్టీతో గెలిపిస్తామని, పేదల ప్రభుత్వాన్ని నిలబెట్టుకుంటామని ఏ గ్రామం, పట్టణానికి వెళ్లినా చెబుతున్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలకు మరోసారి మోసపోమని ఆయన్ని శాశ్వతంగా రాజకీయాలకు దూరం చేసేలా ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని పల్నాడు వాసులు దృఢ సంకల్పంతో ఉన్నారు. పేద ప్రజలకు మంచి జరిగితే ఓర్చుకోని తెలుగుదేశం పార్టీ అన్నివిధాల అడ్డుకోవడానికి పన్నాగాలు పన్నుతోంది. చివరిగా ఒకటే చెబుతున్నా జగనన్న ప్రభుత్వంలో మీకు మంచి జరిగి ఉంటే వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించమని విజ్ఞప్తి చేస్తున్నాను.